కథ

# మనసు వెనక



లక్ష్మీనారాయణ

*అనుబంధాలన్నీ ప్రస్తుత ప్రపంచంలో అణుబంధాలైపోతున్నాయి. మనిషికి కొంచెం స్వార్థం అవసరమే అయినా, మరీ స్వార్థమే మనిషి కానవసరంలేదు. మన అవసరాల కోసం 'పాము- ముంగిస' ఆటలాడుకుంటున్న మానవత్వం ఒక్కొక్కసారి ఆశ్చర్యం గొలుపుతుంది. అలాంటప్పుడు భౌతికత కోసం ప్రాకులాడే భౌతిక దేహాలు ఆత్మల్ని కోల్పోయిన కట్టెలే అవుతాయి.*

తలుపు తీసుకుని బయటకు వచ్చాను.

3.45 చూపిస్తోంది రేడియం డయల్ వాచ్.

ఆలోచనలతో మనసు ముళ్ళకంప మీద ఆరేసిన వస్త్రంలా ఉంది. కళ్ళు మండుతున్నాయి. కంటినిండానిద్రపోయి యుగాలయిందేమో అనిపించేలా...

"ఆలోచనలు రేపటి నిర్ణయాలకు నాందీ వాచకాలు" అనుకుంటూ... అలవోకగా... ఆమెకేసి చూసాను. అంతే... ఆలోచన తెగిపోయినట్లయింది. ఆ వదనంలోని స్వచ్ఛతనం ముందు వేకువ ముంగిట పూచిన సూర్య పుష్పంలా వినమ్రంగా వొదిగి వుండగలగటమే నిజాయితీ అనిపించుకుంటుంది.

ఆమె... పల్లవి. నా భార్య. నిద్రపోతోంది. పెదాలు నవ్వుతున్నాయి జ్ఞాపకంలా... నిర్మలంగా... నిశ్శబ్దంలా... ఇంతక్రితం అనుభవం తాలూకు మగత ఆమె మొహంలో అందంగా ప్రస్ఫుటీకరిస్తోంది. నుదుటన పట్టిన చిరుచెమటకు అంటుకున్న ముంగురులు ఏదో భాషను సంజ్ఞాపూర్వకంగా అనువదిస్తున్నాయి.

అలజడిలో చిక్కుపడ్డ మనసుకు ఆలోచనల కొస దొరికింది. ఏదో అవకాశం అంది పుచ్చుకుంటున్నాం అనుకుంటున్నామేకానీ నిజానికి అందులో స్వార్థం పాళ్ళు ఎంత అని బేరీజు వేసుకుంటే... తేలిపోతుంది. మానవ శరీరాల్ని ఆలంబనగా చేసుకున్నా లేక వారివారి అవసరాలను నిచ్చెనలా చేసుకుని నమ్మినవాళ్ళను వారి ఆశలనూ అవకాశం అనే స్వార్థపు ఎత్తుతో కొల్లగొట్టడం ద్వారా తాను పొందేది తాత్కాలిక ఆనందం మాత్రమే. మరి... కాలం మారిందంటారు కానీ అదంతా వట్టి ట్రాష్! అప్పుడూ... ఇప్పుడూ... ఎప్పుడూ కూడా మారేదీ... మారిందీ... మారుతూందీ కేవలం మనిషే. యెస్... మ.....ని...షే!

నిజానికి ఆలోచనలూ, ఆచరణలూ మధ్య అవసరాల సమాహారమే మనిషంటే.

అనుభవాల సారమంతా ఆర్థికావసరాలే మనిషి మనుగడకు పునాదులవుతాయి అనేది నిజమే. కానీ అంతకుమించిన మానవ సంబంధాల తాలూకు పరిమళమూ, తీపితనాలను వదులుకోవాల్సిన అవసరంలేదు. అలాని, మనం నిన్నలలోనో, మొన్నలలోనో బతకనవసరం లేదుగాక లేదు.

** ** **

"కాఫీ తాగుదామా" నా గొంతు అనుకరిస్తూ కిచెన్‌లోంచి పల్లవి.

ఆదివారం పదకొండయింది. కాఫీ తీసుకువస్తున్న ఆమెకేసి చిర్నవ్వాను.

స్నానించినట్లుంది, చందనం పరిమళం పరిసరాలను చైతన్యపరుస్తోంది. తడితలకు చుట్టిన టవలు ఎత్తుగా కిరీటంలా తెల్లగావుంది.

అలసటను పోగొట్టేలా చల్లని చిర్నవ్వు. తెల్లని వెడల్పయిన కళ్ళూ, సన్నగా పొడుగ్గా వున్న నాసిక, నునుపైన బుగ్గలూ మెరుస్తున్నాయి పచ్చగా, పసుపు రాసినట్లుంది.

"ఏమిటలా చూస్తున్నారు. ఇదుగో కాఫీ తాగేసి, స్నానం చెయ్యరూ..." అని దీర్ఘం తీస్తూ అలవాటుగా పల్లవించింది.

"వూహు!" మెడ వొంపులోని నీడను చిటికెన వేలితో తాకుతూ...లలితంగా నవ్వి, రాత్రి పెట్టుకున్న జాజుల మాలను మంచంపక్కనున్న టీపాయ్‌మీంచి అరచేతుల్లోకి తీసుకుని, అపురూపంగా వాటికేసి చూస్తూ, కళ్ళల్లో అలౌకికమైన వెలుగు ప్రతిఫలిస్తూంటే ఏదో చెప్పాలని తటపటాయిస్తున్నట్లుగా పెదవులు విడివడ్డాయి సన్నగా, అంతకుముందు నాందిగా కుడి కన్బొమ మరింత వంపు తిరిగింది.

"మేడమ్‌గారేదో చెప్పబోతున్నట్లున్నారు. సాయంత్రంగానీ ఎగ్జిబిషన్‌కు వెళదామా?"

"వూహు! ఈరోజు లేజీడే. నో అవుటింగ్స్" నా భుజంపై వెనకనించి చేయి వేసి నా తలలోకి వేళ్ళు పోనిస్తూ... గోముగా పల్లవి.

అవునన్నట్లుగా తలూపుతూ ఆమె చేతిమీద సాభిప్రాయంగా చేయివేసి, గాజులను మెల్లగా మీటాను. లాలనగా ఆమె కళ్ళలోకి చూస్తూ, "నవీన్‌కి ఫోన్ చేయి పల్లవీ ఇందాక ఎంగేజ్ వచ్చింది"

చేతిలోని జాజులమాలను మళ్ళీ టీపాయ్‌మీద పెట్టేసి ఫోన్‌తీసి రీడయల్ బటన్ను ప్రెస్‌చేసింది. అప్పుడు ఆమె చేతివేళ్ళనున్న మెరూన్ కలర్ పాలిష్ ట్యూబ్ వెలుగులో లలితంగా మెరిసింది.

అరనిముషం తరువాత రిసీవర్ నాకిచ్చి ఏదో అసంతృప్తి మొహంలో కనిపిస్తుండగా లోపలికి వెళ్ళిపోయింది.

సమాచార వ్యవస్థ తీవ్ర ఆధునీకం అయిపోవడంతో... ప్రపంచమే ఒక గ్రామంగా మారిపోయింది. ముఖ్యంగా... స్నేహితులమధ్య ఉత్తరాలు రాసుకునే అలవాటు అవుట్‌డేటెడ్ అయిపోతోంది. కాదు మరచిపోయాం. తప్పనిసరిగా రాయాల్సి వచ్చినా, మొక్కుబడిగా పదాల్లో సారం తగ్గిందా లేక వాటిని ఉపయోగించడంలో ఆర్ద్రత తగ్గిందా, భాష సంగతి ఆ తర్వాత... అన్పించేలా మరీ పొడిగా... నుసిగా... మసిగా... చిరాగ్గా అతుక్కుంటున్నట్లుగా పదాలు... అలుక్కుపోతున్నట్లుగా... జిగటగా... మార్దవం లోపించిన పలుకుబడులు... ప్చ్!

ఆ ఊళ్ళో నేను కొనాలనుకుంటున్న ఇంటి గురించి వాకబుచేసి ఏ సంగతి వివరంగా తెలపమని నవీన్‌కి చెప్పి ఫోన్ పెట్టేసాను.

"మీ స్నేహితుడు నవీన్ ఇంట్లో వాళ్ళకు మీరు ఫోన్ చేయడం ఇష్టం లేనట్లుంది" అహోబలం మఠం నించి నడుస్తూంటే ఆ సాయంత్రం పల్లవంది.

అదేంటీ, మీ నవీనంటావేం, మీ పిన్ని కూతురు... కుసుమ భర్త కూడా కదా అన్నట్లు చూసాను.

అదికాదు ఉదయం ఫోన్ చేసినప్పుడు ముందు ఫోన్‌తీసిన ఆమె కుసుమ కూడా కావచ్చు, దూరంనించి 'ఎవరూ' అనడుగుతున్న నవీన్ గొంతు గుర్తుపట్టాను. ఈలోపులో ఫోన్ తీసినావిడ ఫోన్ చేసిందెవరో చెప్పి "సుత్తి" అందామె, సుత్తి అని వత్తి పలుకుతూ. నేను విన్నాను, బాధనిపించింది. మనం ఫోన్ చేసింది కేవలం కుశలప్రశ్నలడగటానికీ తర్వాత వీలైతే వాళ్ళాయనకు తెలిసిన వాళ్ళ ద్వారా మనం అనుకున్న పని త్వరగా తెములుతుందేమో అనేకదా, లేకపోతే 'అప్పు' అడుగుతామనుకున్నారా? ఏమన్నానా" అంది పల్లవి నొచ్చుకున్నట్లుగా.

"అలా అయుండదు, పల్లవీ, నేను కనుక్కుంటాగా"

ఇంకా నయం! అడుగుతానన్నారు కాదు" మూతి మూడువంకర్లు తిప్పి గొప్ప అయిష్టంగా-

సర్లేనన్నట్లుగా తలూపుతూ పల్లవి చేయందుకుని సున్నితంగా వేళ్ళల్లో

వేళ్ళు కలిపి పట్టుకున్నాను. ఈ అందమైన సాయం సమయాన్ని ఏవేవో కారణాలతో మనకై మనం దూరం చేసుకోవడమెందుకూ అనే భావాన్ని ఆ... నా... స్పర్శలో కమ్యూనికేట్ చేయగలిగాను. మౌనంగా పరచుకున్న చీకటి విరులపై తళుకులీనే నక్షత్రాలను చూస్తూ...!

** ** **

రాత్రి భోజనం అనంతరం డాబాపై పచార్లు చేస్తూంటే కూడా అదే ఆలోచన వెనగ్గా వస్తూన్న గాజుల సవ్వడికి మెల్లగా తలతిప్పాను. ఆ తదియ నాటి రాత్రి వెన్నెల శలాకలా పల్లవి.

అన్యమనస్కంగానే బయలుదేరాను. అయినా... ఎడతెగని ఆలోచన... ఆలోచనలతో అలసినప్పుడు మాగన్నుగా నిద్ర... రైలు పరిగెడుతూనేవుంది గమ్యంకేసి... కానీ... కానీ... హఠాత్తుగా మెలకువ వచ్చి చూస్తే రైలు ఆగివుంది. ఏ స్టేషనో కనుక్కుంటే 'విజయవాడ' దిగి బస్టాండుకు వచ్చాను. రాత్రి 1.30కి హైదరాబాద్ వెళ్ళే బస్సెక్కిన కాస్సేపటికి కానీ కారణం తెలీలేదు.

"తప్పదా!" అది స్వగతమో, ప్రశ్నో తెలీకుండా... ఉపోద్ఘాతం అవసరం లేకుండా...

"అదికాదు పల్లవీ, ఇప్పుడు నేను ప్రయాణం మానుకుంటే మనం అనుకున్న పనులెప్పటికి తెమిలేనూ... అయినా... నేను వస్తున్నట్లుగా నవీన్‌కు ఫోన్‌చేసి మరీ చెప్పాంకదా..." అనునయంగా అయినా దృఢంగా...

"అవుననుకోండీ... కానీ!" నన్ను ఆనుకుని కూర్చుంటూ మెల్లగా.

"సరే! నన్ను వెళ్ళొద్దా అనడానికి తగిన కారణం చెప్పు, పోనీ అక్కడ ఇల్లు కొనడం నీకు ఇష్టంలేదా- ముందే చెప్పాకదా... అక్కడ ఇల్లు కొనడం కేవలం సెంటిమెంటేగానీ... మరో కారణం కాదనీ... నీకూ తెలుసు. ఒ.కే. నేను రావడంలేదని ఫోన్‌చేసి చెప్పేస్తా" కొంచెం అసహనంగా.

"అలా అనికాదుకానీ... మరో రెండు రోజుల తర్వాత అయితే...!"

అదే అంటున్నా. మనం ముందు అనుకునేకదా, నవీన్‌కి ఫోన్‌చేసి చెప్పడంతో వాడు ఈ పాటికి ఆ ఇల్లు గురించి అన్నీ అరేంజ్ చేసుంటాడు. అయినా ఇప్పటికీ, మరో రెండు రోజుల తర్వాతకీ అంత తేడా ఏమిటి? అదీకాకుండా వచ్చే వారం నాకు లీవు దొరకదనీ, ఆఫీసులో ఆడిట్ తలనెప్పులున్నాయనీ చెప్పాకదా" విసుగుని గొంతులో మిళాయించి మెల్లగా.

వెంటనే... "సారీ పల్లవీ" అంటూ దగ్గరకు తీసుకుని గెడ్డం కింద చేయివేసి అనునయిస్తున్నట్లుగా "అక్కడ ఇల్లు కొనడం కేవలం సెంటిమెంట్ మాత్రమే... పోనీ... కేన్సిల్ చేసుకుందాం" అన్నాను దృఢంగా ఒక నిర్ణయానికి వచ్చినట్లుగా.

"అయితే వెళ్ళిరండి" కాన్ఫిడెంట్‌గా నా కళ్ళలోకి చూస్తూ.

** ** **

తలతిప్పి చూసాను. పల్లవి అటు తిరిగి పడుకునుంది. మెలుకువగానే వుందని తెలుస్తూంది, దీర్ఘంగా శ్వాసిస్తున్నందువలన. భుజం మీద చేయివేసి 'సారీ' అన్నాను విష్పరింగ్‌గా.

ఇటుతిరిగి సమ్మోహనంగా నవ్వి, భుజం మీది నా చేయి తన అరచేతిలోకి తీసుకుంది పల్లవి.

మెడవంపులో పెదిమలు ఆన్చి... మెల్లగా 'సారీ' అన్నాను మరలా తనకు మాత్రమే వినబడేలా.

'ఊ!' అంటూ సన్నగా వాయులీనం మీంచి విన వస్తున్నట్లుగా.

టీపాయిమీది జాజులమాల తీసి ఆమెకిచ్చాను.

ఆకాశంలో మబ్బుతెర తొలగింది, చంద్రుడు ఆర్తితో తారను చేరాడు. గాలి బరువెక్కింది. వెన్నెల వేడెక్కింది.

** ** **

ఆఫీసు అయిన తర్వాత అటునించి స్టేషన్‌కి వెళతానని చెప్పి వచ్చానన్నమాటేగానీ... గత నాలుగైదురోజులనుంచీ ఎంతలా నచ్చచెప్పినా ఎందుకంతగా పల్లవి వెళ్ళొద్దని పట్టుపడుతూందనే ఆలోచనతోటే సరిపోయింది.

ఈలోపులో పల్లవి రెండుసార్లు ఫోన్ చేసిందట. కానీ నేను మా ఎం.డి.తో మీటింగ్‌లో వుండటం వల్ల తర్వాత నేను ఇంటికి ఫోన్ చేసినప్పుడు లైన్ కలవక పోవడం వల్ల మాట్లాడడం కుదరలేదు.

అన్యమనస్కంగానే బయలుదేరాను. అయినా... ఎడతెగని ఆలోచన... ఆలోచనలతో అలసినప్పుడు మాగన్నుగా నిద్ర... రైలు పరిగెడుతూనేవుంది గమ్యంకేసి... కానీ... కానీ... హఠాత్తుగా మెలకువ వచ్చి చూస్తే రైలు ఆగివుంది. ఏ స్టేషనో కనుక్కుంటే 'విజయవాడ' దిగి బస్టాండుకు వచ్చాను. రాత్రి 1.30కి హైదరాబాద్ వెళ్ళే బస్సెక్కిన కాస్సేపటికి కానీ కారణం తెలీలేదు. అదే బస్సులో ప్రకాశం... మావూరివాడే. రెవిన్యూ శాఖలో సీనియర్‌గా చేస్తున్నాడు అక్కడే... ఆఫీసు పని మీద బయలుదేరాడు. మాటల్లో తెలిసింది. నన్ను బలంగా వెనక్కి వెళ్ళిపొమ్మని మనసు పోరిన కారణం. దిల్‌సుఖ్‌నగర్‌లో బస్ దిగి ఆటోలో ఇంటికి వచ్చేసాను.

తలుపుతీసిన పల్లవి కళ్ళు కమలాలు పూచినట్లు... ఆశ్చర్యం... కల్హారాలు వర్షించాయి... దుఃఖపు ఉద్వేగం... పగడాలు త్రుళ్ళిపడి ఒక్కసారిగా పగిలినట్లుగా.

"నిద్రపోలేదా రాత్రంతా" నా ప్రశ్న నాకే చాలా కృతకంగా అనిపించింది. సోఫాలో కూర్చుంటూ...

అదికాదు... మీరలా ఆఫీసుకు వెళ్ళిన వెంటనే నవీన్ టెలిగ్రాం వచ్చింది, బయలుదేరవద్దనీ... మిగతా సంగతులు తరువాత చెప్తాననీనూ. మీకోసం ఆఫీసుకు ఎన్నోసార్లు ప్రయత్నించాను ఏదో మీటింగులో ఉన్నారనే సమాధానం వచ్చింది" ముక్కెగపీలుస్తూ.

ఆ సమయంలో పల్లవిని చూస్తుంటే చెప్పిందానికంటే చెప్పాలనుకుంటున్నది ఇంకా ఎంతో వున్నదనిపించింది. అది నా ఊహ కావచ్చు... కానీ, ఆమె ధోరణికి ఇప్పటి వాతావరణం... ఏమో... ఎందుకు... నాకలా అనిపించింది అంతే. దగ్గరకు తీసుకుని భుజంమీద అనునయంగా వేళ్ళతో రాస్తుంటే... "వచ్చేసారే" గుండెలపై తలానిస్తూ గోముగా-

"నీ గురించి ఆలోచనే- అంతా... అసలు నువ్వు నన్ను వెళ్ళొద్దని ఎందుకలా మంకుపట్టు పట్టావో కదా అనే... ఆలోచన... రాత్రంతా ఇంక ముందుకు వెళ్ళలేక విజయవాడలో రైలుదిగి బస్సెక్కి వెనక్కి వచ్చేసాను.

** ** **

అందాకా చీకట్లో దాగిన సూరీడు ఫక్కుమన్నాడు.

తొలికిరణాలు వెచ్చగా వాకిలంతా పరచుకున్నాయి బంగారు తివాచీలా... పల్లవి అడుగుల సవ్వడి వినవస్తోంది. అయినా పక్కమీద దొర్లుతున్నాను. కానీ... కళ్ళిప్పలేదు.

"అంతా దొంగనిద్ర" అంటూ దుప్పటి లాగేసింది.

"ప్లీజ్" నిద్ర నటిస్తూ

"అహ! ఇటు చూడండి" సాధికారంగా నన్ను పట్టుకుని కుదుపుతూ...

"ఏమిటీ" నిద్రమత్తులో కనులు తెరిచినట్లుగా

"అబ్బా! నటించకండీ- మీకు నటన అచ్చిరాదు" కొంటెగా నవ్వుతున్నాయి పల్లవి పెదవులు.

"చె...ప్పు..." ఆవలిస్తూ.

"ఆ నా సెలక్షను కంటె మీ ఎంపిక ఉత్తమంగా వుంది కదా" తను కొన్న టీషర్ట్‌ని చేతికిస్తూ.

అర్థమైంది ఆ గొంతులోని శ్లేష.

"అవునుమరి. వారణాసి వారమ్మాయి తెలివైన నిర్ణయం తీసుకుంటుందని... చెప్పకనే చెప్తున్నాయి నీ కళ్ళు" అన్నా అదే శ్లేషను అనుకరిస్తూ... అప్పటికే నేను కొన్న మంచి గంధంరంగు చీర ఆమె వంటిమీద మెత్తగా అమరింది మరి.

అప్పుడే అర్థమయింది. నారు! ఈరోజున నేను తన ఎదుట ఉండడం పల్లవికి ఇష్టమని-ఎందుకంటే... మరి... మా పెళ్ళిరోజు కనుక- అనుకున్నాను తన విలాసాన్ని కమనీయంగా క్రీగంట చూస్తూ!

మరి పల్లవి ఏమని ఆలోచిస్తోందో... ముందే ప్లాన్ చేసిన ప్రకారం, నేను కొన్న ఆ చీరను ఈవేళ కనిపించేలా అమర్చానని... తెలుసుకుందా... ఏమో గడుసరి మాత్రమేనా? ఏమేమో....!

అవును, నేను కొనాలనుకున్న నా సెంటిమెంటల్ ఇల్లును... వాడు... యెస్. నవీన్ చాలా తెలివిగా... అది... అది... తెలివనే... అందామా సొంతం చేసుకున్నాడు. తరువాత అతను ఏ కారణం అయినా చెప్పొచ్చుకానీ- జరిగింది మాత్రం...

నవీన్ కుసుమల నూతన గృహప్రవేశం ఈ ఉదయాన్నే అని... రాత్రి ప్రకాశం బస్సులో చెప్పిన విషయం... పల్లవికి ఇప్పుడు చెప్పకూడదనిపించిందన్నది మాత్రం... నిఝంగా... నిజం!

## మారకపోతే నిలిచిపోతాం: సోనాలీ



మనుషులు మారడం అనివార్యం. మారడం అవసరం అంటోంది సోనాలీ బింద్రే. ముఖ్యంగా సినిమా రంగంలో ఉన్నవాళ్ళు పరిస్థితులకు తగ్గట్టుగా మారి తీరాలి. మారకపోతే ఉన్నచోటనే నిలిచిపోతారు. క్రియేటివ్‌గా ఆలోచించేవాళ్ళు మారడానికి ఎప్పుడూ అనుకూలంగా ఉంటారు. ఎందుకంటే జీవితంలో మార్పు అనివార్యమని ఆమె నమ్మకంగా చెబుతోంది. మూడేళ్ళ క్రితం ఉన్నట్టు ఇప్పుడు లేను. ఇప్పుడు ఉన్నట్టు మరో మూడేళ్ళ తర్వాత ఉండే అవకాశం లేదు. ఈ మార్పు సహజమని ఎంతో అనుభవంగలదానిలా మాట్లాడుతోందామె. తన జీవితానికి సంబంధించి గత ఏడాది 'సర్ఫరోష్' మంచి ప్రారంభాన్నిచ్చిందని చెబుతూ, ఈ ఏడాది తనలోని ప్రతిభను మెరుగుపరుచుకునేందుకు వీలైన మంచి స్క్రిప్టులు రావాలని కోరుకుంటున్నట్టు చెప్పింది. ఆమె ఆశలు ఎంతవరకు ఫలిస్తాయో వేచిచూడాలి.



3